


TGTEL/25/A31

నేటి దిక్సూచి
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ జిల్లాలు

## ఎంఈఓ సీజ్ చేసినా.. యథేచ్ఛగా నడుస్తున్న కాకతీయ పాఠశాల..?

**అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న యాజమాన్యమా..?**

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..?**

**కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్**



ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఎంఈఓ సీజ్ ఆదేశాల అమలుపై స్పష్టత ఇవ్వడంతో పాటు, పాఠశాల కొనసాగింపుపై వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తారా? లేక ఆరోపణలపై సమగ్ర విచారణ అనంతరం కఠిన చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

రంగా రెడ్డి ప్రతినిధి /హయత్‌నగర్, దిక్సూచి :




హయత్‌నగర్ మండల పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్‌లో ఉన్న కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్‌పై వరుసగా వెలువడిననేటి దిక్సూచి దిన పత్రిక లో కథనాల నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ స్పందించి, సంబంధిత పాఠశాలను సీజ్ చేసినట్లు సమాచారం. అయితే, ఎంఈఓ ఆదేశాల అనంతరం కూడా యాజమాన్యం పాఠశాలను యథావిధిగా నిర్వహిస్తోందన్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ఆరోపణల ప్రకారం, సంబంధిత పాఠశాలకు పదో తరగతి నిర్వహించేందుకు అనుమతి లేకపోయినా, గత కొన్ని సంవత్సరాలుగా పదో తరగతి అడ్మిషన్లు తీసుకుని, పరీక్షల సమయంలో అనుమతి ఉన్న మరో పాఠశాల ద్వారా విద్యార్థులతో పరీక్షలు రాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై పలుమార్లు వార్తలు వెలువడటంతో విద్యాశాఖ స్పందించి సీజ్ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

అయితే, సీజ్ చేసిన తర్వాత కూడా పాఠశాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు రావడం పట్ల విద్యార్థి సంఘాలు, విద్యా హక్కుల కోసం పనిచేస్తున్న పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి అధికారికంగా సీజ్ చేసిన విద్యాసంస్థ తిరిగి ఎలా నిర్వహణలోకి వచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులను పట్టించుకోకుండా పాఠశాల నిర్వహించడం నిజమే అయితే, అది ప్రభుత్వ అధికారాలకే సవాల్ విసిరినట్టేనని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ చదువుతున్న విద్యార్థుల విద్యా భవిష్యత్తు ఏమవుతుందనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. అడ్మిషన్లు, గుర్తింపు, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు.